




# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

ఆదివారం 4 అక్టోబర్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3







# కోదాడ ఆసుపత్రిలో శరవేగంగా నూతన భవన నిర్మాణాలు





భానుపురి/కోదాడ

కోదాడ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం కోదాడలోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా నిర్మించిన ఇన్‌పేషెంట్ విభాగాన్ని స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా ఎస్పీ నరసింహలతో కలిసి కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.

**-రూ. 26 కోట్లతో 100 పడకల స్థాయికి పెంపు**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా 30 పడకలుగా ఉన్న కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. దీనికోసం ప్రభుత్వం రూ. 26 కోట్లు మంజూరు చేసిందని, నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన శరవేగంగా జరుగుతు న్నాయని చెప్పారు. ఆసుపత్రి పునరుద్ధరణ పనులతో పాటు నూతనంగా నిర్మించిన ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఇన్‌పే షెంట్ విభాగాలు పూర్తికావడంతో వెంట నే ప్రజల వినియోగార్థం అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.

**-అన్ని రకాల సేవలు పునఃప్రారంభం**

శనివారం నుంచే ఆసుపత్రిలో అన్ని రకాల ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినందున కోదాడ తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, రోగులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సహాయం అందించి బాధ్యతా యుతంగా సేవలు అందించాలని వైద్యాధి కారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ, లక్ష్మారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెండెం వెంకటరమణ, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర వైద్యులు, ప్రజా ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

భానుపురి/సూర్యాపేట కల్చరల్



కేంద్రంలోని బీజేపీ ప్రబుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఢిల్లీలో జ్ఞానేశ్వర్ కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం జాతీయ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం వాణిజ్యభవన్ కార్యదర్శి బొమ్మిడి లక్ష్మినారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక వాణిజ్యభవన్ సెంటర్ లో తీవ్ర నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. నగదు రహిత లావాదేవీలను ప్రజలకు అలవాటు చేసి ప్రస్తుతం యూపీఏ చార్జీలు విధిస్తామనడం దారుణమన్నారు. యూపీఏ చార్జీలకు వ్యతిరేకంగా మోదీ నాయ కత్వం వహిస్తున్న గుజరాత్ రాష్ట్రంలో 600ల సంఘాలు రోడ్డెక్కారని మోదీ ప్రబు త్వం ఆగమయ్యే రోజు దగ్గరపడిందన్నారు. అలాగే ఉపాధి హామీ పథకాన్ని పేరుమార్చి కొత్త నిబందనలు పెట్టడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాత పథకాన్ని పునరుద్దరించాలన్నారు. అలాగే సర్ ప్రక్రియ మొత్తం తప్పుల తడకగా ఉందని చనిపోయిన ఓట్లు, డూప్లికేట్ ఓట్లు తీసివేయడంలో తప్పు లేదు కాని అక్షరదోషాలున్న ఓట్లను కూడా తీసివేయడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రధాని నరేంద్రమోదీ అవలంభిస్తున్న దుర్మార్గ విధానాలను ప్రజాక్షేత్రంలో సీపీఎం ఎండగడుతుందన్నారు. అలాగే ఇటివల 150మంది ప్రయాణికులను కాపాడిన పైలట్కు పరమ వీర చక్ర అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఓలంపిక్ పోటీల్లో ఇండియా తరపున పథకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తిని సైదులు, భూపాల్, అంజన్న, ఉప్పనపల్లి శ్రీను, లింగస్వామి, మంద శ్రీను, ఆసీప్, త్రివేణి, యమున, వెంకన్నలు పాల్గొన్నారు.

# అండర్‌డ్రైనేజీ పనుల పేరుతో అవస్థలు

-మ్యాన్‌హోల్ మూతలు లేక ప్రమాదం.. చిన్నారులకు ముప్పు



భానుపురి /సూర్యాపేట టౌన్

అండర్‌డ్రైనేజీ పనుల్లో జాప్యం జరుగుతోందని 47వ వార్డు కాలనీవాసి అంతటి విజయ్‌కుమార్ ఆరోపించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో తన నివాసం ఎదుట నిలబడి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్‌డ్రైనేజీ పనుల పేరుతో గుంతలు తీసి పూడ్చకుండా వదిలేస్తున్నారని తెలిపారు. 47వ వార్డు లోతట్టు ప్రాంతం కావడంతో చిన్న వర్షానికే మోకాళ్లలోతు నీరు చేరుతుందని, అయినా పనులను వేగంగా పూర్తి చేయకుండా ఎక్కడికక్కడ గుంతలు తీసి వదిలేస్తున్నారని వాపోయారు.మ్యాన్‌హోళ్ల కోసం గుంతలు తీసి నిర్మాణాలు చేపట్టినా వాటికి మూతలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయని తెలిపారు. మూతలు లేకపోవడంతో ఇప్పటికే చిన్నారులు మ్యాన్‌హోళ్లలో పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని, దీంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే మ్యాన్‌హోళ్లకు మూతలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు.అండర్‌డ్రైనేజీ పనుల సమయంలో పలు ఇళ్లకు సంబంధించిన వాటర్ పైప్‌లైన్లు ధ్వంసమ య్యాయని, వాటిని పునరుద్ధరించాలని కోరినా సంబంధిత సిబ్బంది స్పందించడం లేదని అన్నారు. దీంతో కాలనీవాసులే సొంత ఖర్చుతో పైప్‌లైన్లకు మరమ్మతులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులను నాణ్యతతో, సమన్వయంతో చేపట్టి త్వరగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

# పోలీసు ఉద్యోగ ఆశావహులకు ఉచిత శిక్షణకు సువర్ణావకాశం

భానుపురి/ సూర్యాపేట కలెక్టరేట్

ఎస్ఐ, కానిస్టేబుల్ పోలీసు ఉద్యోగ నియామకాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 45 రోజుల ఉచిత పోలీసు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు, ఈ శిక్షణకు అర్హులైన వారిని ఎంపిక చేయడానికి ఈనెల 4వ తేదీ ఆదివారం రోజున ఉ.10:30 గంటల నుండి 12 గంటల వరకు జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఎంపిక పరీక్ష నిర్వహించడం జరుగుతుంది అని దీనికోసం ఏర్పాట్లు చేయడం జరిగినది అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. పోలీసు ఉద్యోగ నియామకాలకు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకో వాలని https://suryapet. telangana.gov.in/ నందు ఉచిత శిక్షణకు ధరకాస్తు చేసుకోవాలని కలక్టర్, ఎస్పి సూచించారు. శిక్షణకు అభ్యర్థుల ఎంపిక కోసం అక్టోబర్ 4, ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

**-నియోజకవర్గాల వారీగా పరీక్షా కేంద్రాలు..**

**-సూర్యాపేట నియోజకవర్గం:**

సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట, ఆత్మకూరు, పెనపహడ్, చివ్వేంల మండలాలకు చెందిన అభ్యర్థులు సూర్యాపేట పట్టణంలో శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే ఎంపిక పరీక్షకు హాజరు కావాలి. ఈ పరీక్షా కేంద్రం సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

**-కోదాడ నియోజకవర్గం:..**

కోదాడ నియోజకవర్గ పరిధిలోని కోదాడ, చిలుకూరు, అనంతగిరి, మునగాల, నడిగూడెం, మోతే మండలాలకు చెందిన అభ్యర్థులు కోదాడ పట్టణంలో కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్షకు హాజరు కావాలి. ఈ పరీక్ష కేంద్రం కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

**-హుజూర్‌నగర్ నియోజకవర్గం:**

హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఏడు హుజూర్నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకావీడు, మఠంపల్లి, చింతలపాలేం, మెల్లచేరువు మండలాలకు చెందిన అభ్యర్థులు హుజూర్నగర్ లో గ్రీన్‌వుడ్ పాఠశాలలో జరిగే పరీక్షకు హాజరు కావాలి. ఈ పరీక్ష కేంద్రం హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమం దరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

**-తుంగతుర్తి నియోజకవర్గం:**

తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్, అర్వపల్లి, తిరుమలగిరి, నాగారం మండలాలకు చెందిన అభ్యర్థులు తిరుమలగిరి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పరీక్షకు హాజరు కావాలి. ఈ పరీక్ష కేంద్రం నాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

**-స్క్రీనింగ్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తీసుకురావాల్సినవి**

- తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు సమర్పించిన పోలీసు ఉద్యోగ దరఖాస్తు.
- ఉచిత శిక్షణ కోసం చేసుకున్న స్క్రీనింగ్ పరీక్ష దరఖాస్తు.
- ఆధార్ కార్డు జిరాక్స్.

**-45 రోజుల ఉచిత శిక్షణ..**

స్క్రీనింగ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 400 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 45 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్, ఎస్పీ తెలిపారు.



సూర్యాపేట జిల్లా కేంద్రంలో 200 మంది, కోదాడ పట్టణంలో 200 మంది అభ్యర్థులకు శిక్షణ అందించనున్నారు. శిక్షణలో ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణతో పాటు రాత పరీక్షకు అవసరమైన అంశాలపై శిక్షణ, నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందించడం, నిష్ణాతులైన శిక్షకులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోలీసు ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్క్రీనింగ్ పరీక్షకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాలని ముందస్తు శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ కోరారు.

**-ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి..జిల్లా ఎస్పి.**

పరీక్షా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ద్విచక్ర వాహనాల పై వేగంగా ప్రయాణించకుండా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వీలైనంత వరకు ప్రజా రవాణా, బస్సులను వినియోగించి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న యువతకు ఇది మంచి అవకాశం -- తప్పక సద్వినియోగం చేసుకోండి అని కలక్టర్, ఎస్పి తెలిపినారు.

# అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

భానుపురి/సూర్యాపేట టౌన్

యుద్ధం వలన మానవాళికి అంతులేని నష్టం జరుగుతుందని యుద్ధం వలన ప్రాణహానితోపాటు భవిష్యత్ తరాలు తీవ్రంగా దెబ్బతింటాయని అఖిలభారత సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి ప్రముఖ న్యాయవాది కె.వి.ఎల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మండపల్లి ప్రభాకర్ ఫంక్షన్ హాల్ లో జిల్లా నాలుగో మహాసభలో పాల్గొని మాట్లాడుతూ వ్యక్తి ఆలోచన మూలంగానే శాంతి గాని యుద్ధం గాని వస్తాయని, చెడు ఆలోచన అనేది ప్రపంచాన్ని వేరు చేస్తుందని ఆయన అన్నారు. సామ్రాజ్యవాదం కాంక్షతో అమెరికా వంటి దేశాలు ప్రపంచంలోని చిన్నచిన్న దేశాలను ఆక్రమించాలని చూస్తున్నాయని, తమ వ్యాపార విస్తరణ కోసం యూరప్ దేశాలు కూడా అమెరికాకు వంత పాడుతున్నాయని ఆయన అన్నారు. ఇరాన్ పై యుద్ధం వలన ఇరాన్ లో వేలాది మంది క్షతగాత్రులవడం, చిన్నారులు చనిపోవడం, అంగ వికలాంగులు కావటం జరిగిందని అన్నారు. ఆహార పదార్థాల కొరత అవసరమైన నిత్యవసర మందులు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, యుద్ధం మానవాళికి మంచిది కాదని ఆయన అన్నారు. సామ్రాజ్యవాదం నశించాలని, సామ్యవాదం వర్ధిల్లాలని, యుద్ధం వద్దు శాంతి ముద్దు, ఉగ్రవాదం మతోన్మాదం వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. మౌనంగా వుండే వారి వల్ల దేశానికి ఎటువంటి ప్రయోజనం లేదని మౌనంగా ఉండటం వల్ల అభివృద్ధి ఆగిపోతుందని,



ఆలోచన లేని వ్యక్తులతో సమాజం బాగుపడదని అన్నారు. శాంతియుతంగా జీవిద్దాం ప్రగతివైపు పయనిద్దామని వారు అన్నారు. ప్రతి ఒక్కరు కూడా అమెరిక యొక్క యుద్దకాంక్షకు



వ్యతిరేకంగా గొంతు విప్పాలని, నిరుద్యోగం, నిరక్షరాస్యత, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన అన్నారు. మహాసభకు ముందు జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేశారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలి

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

ఖరీఫ్ 2026--27 సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లాలో 352 ధాన్యం కొనుగోలు కేంద్రాలను గుర్తించగా, 267 కేంద్రాలను మొదటి దశలో ప్రారంభించేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. మొదటి దశలో ప్రారంభించే కేంద్రాల్లో మౌలిక వసతులు, తూకం, నాణ్యత పరీక్ష, గన్నీ సంచులు, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా, నిల్వ తదితర ఏర్పాట్లను పూరి స్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు.

**-కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు సిద్ధంగా ఉంచాలి**

ప్రతి కొనుగోలు కేంద్రంలో తూకం యంత్రాలు, తేమ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులు, టార్పాలిన్లు, హమాలీలు తదితర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు.వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రైతులకు అవసరమైన మేరకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతులకు టోకెన్ల జారీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

**-కొనుగోలు చేసిన ధాన్యం సత్వరమే తరలించాలి**

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువ కాలం నిల్వ ఉంచకుండా సత్వరమే సంబంధిత గోదాములకు తరలించేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధంగా ఉంచి, సంబంధిత రవాణా కాంట్రాక్టర్లు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ధాన్యం రవాణా వాహనాల కదలికను జీపీఎస్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సన్న/ఫైన్ వెరైటీ ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**-మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా పారదర్శక కొనుగోళ్లు**

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు లేకుండా, రైతుల నుంచి నేరుగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా నకిలీ ట్రక్ చిట్స్, తప్పుడు రవాణా వివరాలు, నకిలీ వాహనాల వినియోగం లేదా ఇతర అక్రమాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఏవైనా అక్రమాలు లేదా తప్పిదాలు జరిగినట్లు గుర్తించినట్లయితే, బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

**-అధికారుల సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ**

కొనుగోళ్లు, నాణ్యత పరీక్ష, తూకం, రవాణా, గోదాం నిల్వ, ఫ్రూమీ నమోదు, రైతులకు చెల్లింపులు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.



**-సమావేశంలో పాల్గొన్న అధికారులు**

సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. హరి సింగ్, జిల్లా పౌరసరఫరాల అధికారి వి. మోహన్ బాబు, జిల్లా మేనేజర్ (సివిల్ సప్లైస్) వి. శ్రీధర్ రెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్ కుమార్, జిల్లా సహకార సూపరింటెండెంట్ కె. అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లైస్ అసిస్టెంట్ మేనేజర్ బెన్నర్జీ, రమేష్ నాయక్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ లలితా పరమేశ్వరి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి





భానుపురి/సూర్యాపేట కల్చరల్

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి శ్రీ లలితా పరమేశ్వరి మాత ఆశీస్సులతో సూర్యాపేట ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రముఖ వ్యాపారవేత్త, జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు కుక్కడపు శ్రీనివాస్ తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గుండా శ్రీధర్ బృందం ఆధ్వర్యంలో సామూహిక లలిత సహస్రనామ పారాయణము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంత లభిస్తుందని ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా కొంత సమయం దైవానికి కేటాయించాలన్నారు. 21 రోజులపాటు ప్రతిరోజు సామూహిక లలితా సహస్రనామ పారాయణంతోపాటు విష్ణు సహస్రనామ పారాయణం, ఖడ్గ మాల,మణిద్వీప వర్ణన, హనుమాన్ చాలీసా పారాయణం తోపాటు భజన కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం10 గంటలకు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ లలితా మాత ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు కుక్కడపు నాగలక్ష్మి, కొండపల్లి లక్ష్మ య్య చలపతిరావు, చంద్ర శేఖర్, కమటాల వెంకటేశ్వర్లు, మహిళా భక్తులు గుం డా ప్రేమలత, కలకోట అనిత, తెడ్ల పల్లవి, బజ్జూరి నిర్మల చంద్రావతి, మనసాని అరుణ పబ్బా ప్రమీల, రాచర్ల ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులకు సన్మానం

భానుపురి/సూర్యాపేట కల్చరల్



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ బండారు రాజా కమిటీ సభ్యులు తోట శ్యాంప్రసాద్, వెంపటి పురుషోత్తం లను దేవాలయ చైర్మెన్ పోతుగంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్య వైశ్యులు,భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఆపదలో ఉన్న వారికి రక్తం అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్య నిర్వహణ అధికారి లక్ష్మణ రావు కౌన్సిలర్ గండూరి రమేష్ నాయకులు తప్సి గాంధీ,కలకోట లక్ష్మయ్య,యమా ప్రభాకర్, వెంపటి శబరినాథ్,చల్లా సత్యనారాయణ, ఉప్పలచు కృష్ణ,కొండ శ్రీనివాస రావు, చిత్తలూరు శ్రీధర్ రావు,తెరటపల్లి సతీష్, నవిలి నరేందర్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసి ఎన్నికలలో టిఎం యు, ఇయు, ఎన్ ఎం యు జె ఎసిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

**-టిఎంయు రాష్ట్ర జనరల్ సెక్రటరీ థామస్ రెడ్డి**



భానుపురి/సూర్యాపేట టౌన్

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో టిఎం యు, ఇయు, ఎన్ ఎమ్ యు యూనియన్ జె ఎసి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జేఏసీ నాయకులు, టిఎంయు జనరల్ సెక్రెటరీ థామస్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం సూర్యాపేట డిపోలో జరిగిన జేఏసీ ఎన్నికల ప్రచార సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అసలైన యూనియన్ తమ జేఏసీ మాత్రమే అని , కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జె ఎసి ని గెలిపించాలని అన్నారు. తమ జేఏసీ తెలంగాణలో 10,000 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. క్లాస్ 3 లో బస్సు గుర్తుకు క్లాస్ 6 లో నిచ్చెన గుర్తుకు ఓటు వేయాలని తెలియజేశారు. ధర్మానికి అదర్మానికి జరుగుతున్న ఎన్నికలలో ధర్మమే గెలుస్తుందని అన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలని ప్రభుత్వం జోక్యం చేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఇయు రాష్ట్ర అధ్యక్షులు బాబురావు, రహిముద్దిన్, మేకల శ్రీనివాసరావు, పాటి అప్పారావు, నరేందర్, రాఘవరెడ్డి, డివి రత్నం తదితరులు పాల్గొన్నార

# చిట్టీలు, అధిక రాబడి పేరుతో కోట్లు రూపాయలు వసూళ్లు -- ఇద్దరు అరెస్ట్

భానుపురి/సూర్యాపేట టౌన్




చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధిలో చిట్టీలు, డెయిలీ కలెక్షన్లు, అధిక రాబడుల పేరుతో ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడిన దానిపై చివ్వెంల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి ఈ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు అతని భార్యను చివ్వెంల పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్ కేసు వివరాలు, నిందితుల అరెస్ట్ వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ జి. రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ వి. మహేష్, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.చివ్వెంల మండలం యెనగండి తండాకు చెందిన బానోత్ రాజు (44), ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తన భార్య బానోతు అనూష (33) సహకారంతో 2015 నుంచి డెయిలీ కలెక్షన్లు, చిట్టీల వ్యాపారం నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది అని డిఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. అధిక రాబడులు, నెలవారీ చెల్లింపులు ఇస్తామని నమ్మించి ప్రజలు, తోటి ఉద్యోగులు, పరిచయస్తుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే భూములు కొనుగోలు చేస్తున్నట్లు నమ్మించి పలువురి నుంచి నగదు తీసుకున్నట్లు, చిట్టీల గడువు పూర్తైనప్పటికీ డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. సేకరించిన మొత్తంలో కొంత భాగాన్ని వ్యక్తిగత అవసరాలు, ఆస్తుల కొనుగోలుకు వినియోగించగా, మిగిలిన మొత్తాన్ని సుమారు 500--600 మందికి రూ. 10,000 నుంచి రూ. 2 లక్షల వరకు నెలకు 10 శాతం వరకు అధిక వడ్డీకి అప్పుగా ఇచ్చినట్లు గుర్తించడం జరిగినదని డిఎస్పీ తెలిపారు.

**-కేసులో ఇప్పటివరకు గుర్తించిన ఆర్థిక వివరాలు**

- బాధితుల నుంచి సేకరించిన మొత్తం: రూ. 6,24,50,000/-
- తిరిగి చెల్లించిన మొత్తం: రూ.3,18,54,000/-
- ఇంకా చెల్లించాల్సిన బకాయిలు: రూ. 3,05,96,000/-

నిందితుల నుంచి స్వీకరించిన మొత్తాలు, తిరిగి చెల్లింపులు, ప్రామిసరీ నోట్లు, చెక్కులు, బాండ్లు, భూముల లావాదేవీలకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

**-అరెస్టయిన నిందితులు**

1.బానోత్ రాజు,, వయస్సు 44 సంవత్సరాలు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు.2. బానోతు అనూష, భర్త: రాజు, వయస్సు 33 సంవత్సరాలు, గృహిణి.

ఇద్దరినీ అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నారు. ఇతర బాధితులు పోలీసులను సంప్రదించాలి..బానోత్ రాజు, బానోతు అనూష చేతిలో మోసపోయిన ఇతర బాధితులు ఎవరైనా ఉంటే, తమ వద్ద ఉన్న ఆధారాలతో వెంటనే చివ్వెంల పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. ప్రజలను అధిక రాబడులు, చిట్టీలు, పెట్టుబడుల పేరుతో మోసగించేందుకు ప్రయత్నించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరించారు.కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన సీఐ జి. రాజశేఖర్, ఎస్ఐలు వి. మహేశ్వర్, వెంకన్నతో పాటు సిబ్బంది జనార్దన్ రెడ్డి, వెంకటేష్‌లను అధికారులు అభినందించారు.

# బుల్లెట్ ట్రైన్ సాధన ధ్యేయంగా ఉద్యమాలను ఉధృతం చేయాలి

భానుపురి /సూర్యాపేట టౌన్




బుల్లెట్ ట్రైన్ సాధనే ధ్యేయంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని అందుకు ప్రజలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి పిలుపునిచ్చారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో ధర్నా చౌక్ వద్ద కొనసాగుతున్నశనివారం 51వ రోజు రిలే నిరాహార దీక్ష లో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమాలను జాతీయ రహదారి 65 సమాంతరంగా ఆనుకొని ఉధృతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని నాయకులు ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి మొదటి అలైన్మెంట్ను కొనసాగించాలని వారు తెలిపారు. ప్రజలు బుల్లెట్ ట్రైన్ పై పూర్తిస్థాయి అవగాహన కలిగి మనకు రావాల్సిన బుల్లెట్ ట్రైన్ కొందరు స్వార్థంతో పక్కదారి పట్టిస్తుంటె చూస్తూ నిర్లక్ష్యం చేసినట్లైతే కొన్ని దశాబ్దాల పాటు సూర్యాపేటకు రైలు మార్గం చూడలేమని వారన్నారు.ఈ దీక్షలో బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యులు చల్లమళ్ళ నర్సింహ వెలుగు వనిత, అబ్దుల్ కరీం, నల్లేడ మాధవరెడ్డి,నాగయ్య, యర్కచర్ల శోభారాణి, పాల్గొనగా మండాది డేవిడ్ కుమార్, పెన్షనర్ ల సంఘం నాయకులు హమీద్ ఖాన్, జర్నలిస్టు భూపతి రాములు సంఘీభావం తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీకి మా కుటుంబం నాలుగు తరాలుగా విధేయులం





ఎలాంటి



తండ్రి

భానుపురి/అర్వపల్లి

అర్వపల్లి శ్రీ యోగనందా లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, నల్లగొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అనంతరం విలేఖరులతో మాట్లాడారు.తమ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో నాలుగు తరాలుగా అనుబంధం ఉందని, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో తమ కుటుంబానికి సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయని సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. తనకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.తన అభ్యర్థిత్వంపై గందరగోళం, అసంతృప్తి లేదని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని తమ కుటుంబం ఎప్పుడూ ధిక్కరించలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంతా ఒక్కటై తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిందని, తాను కాంగ్రెస్ పార్టీకి విధేయుడినని పేర్కొన్నారు. అసత్య ప్రచారాలకు తావులేదని అన్నారు.తనకు టికెట్ లభించడంలో దేవుడి ఆశీస్సులతో పాటు తన తండ్రి, దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశీస్సులు ఉన్నాయని సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. దామోదర్ రెడ్డి ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని అన్నారు.ఎఅమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించిన తాను, కెనడా, అమెరికాల్లో ఆసియా ఖండంలోనే అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన సంస్థలో ఉన్నత స్థాయిలో ఉద్యోగం చేసిన అనుభవం ఉందన్నారు. తన కోరిక మేరకు రాజకీయాల్లోకి వచ్చానని, 2012 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్నానని తెలిపారు. 2014, 2019 ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పార్టీ అధిష్టానాన్ని కోరినట్లు గుర్తుచేశారు. అమెరికా నుంచి తిరిగి వచ్చి ప్రస్తుతం రైతుగా వ్యవసాయం చేయడంతో పాటు డైరీ, చేపల పెంపకం వంటి రంగాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నానని, యుద్ధరం గంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు.అన్ని పార్టీల కంటే ముందుగానే కాంగ్రెస్ పార్టీ తనను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిందని సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఎమ్మెల్సీ ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు గ్రామ గ్రామాన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ హెల్ప్‌లైన్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు.తమ ఇంటి ఇలవేల్పు అయిన శ్రీ యోగనందా లక్ష్మీ నరసిం హస్వామి వారిని దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంద న్నారు. ఈ దేవస్థానం అభివృద్ధి కోసం తమ కుటుంబం తరఫున 850 ఎకరాల భూమిని దానం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.రాంరెడ్డి కుటుంబం కాంగ్రెస్ పార్టీకి విరవిధేయులు. సర్వోత్తమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి విధేయుడే. పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వపి ాస్తూ, పట్టభద్రుల సమస్యలను ప్రజల తరఫున బలంగా వినిపించేందుకు కృషి చేస్తాను" అని సర్వోత్తమ్ రెడ్డి తెలిపారు.

## బతుకమ్మ పుస్తక ముకు సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదాలు

భానుపురి /సూర్యాపేట కల్చరల్



మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబిం బించాలనే ఉద్దేశంతో గత నాలుగు సంవత్స రాలుగా తెలంగాణలో అతిపెద్ద పండుగ అయిన బతుకమ్మ పండుగ పాటలను ప్రతి ఒక్కరి ఇంటికి చేర్చాలని ఉద్దేశంతో దాతల సహకారంతో ప్రతి సంవత్సరం వెయ్యి పుస్తకాలు ప్రచురించి ఉచితంగా అందజే యడం జరుగుతుంది. ఈ సంవత్సరం కూడా పుస్తకం ముద్రణకు సోషల్ మీడియా ద్వారా స్పందించి సహకరించిన మిత్రులందరికీ ధన్యవాదములు. పేద ఆర్యవైశ్యులకు సేవలందించాలని ఉద్దేశంతో శ్రీ వాసవి రక్షణ కవచం స్థాపించి సెప్టెంబర్ నెలలో పేద ఆర్య వైశ్య ఆడబిడ్డకు పదివేల రూపాయల సహాయం అందించడం జరిగింది. ఆర్యవైశ్యు లు కేవలం 100 రూపాయలు విరాళము చెల్లించినచో అట్టి నగదుతో ప్రతి నెల ఒక ఆర్యవైశ్య కుటుంబానికి పదివేల రూపాయలు అందించే ఈ సేవా కార్యక్రమంలో మీరు కూడా భాగస్వాములు కాగలరు. శ్రీ వాసవి మాత అమ్మవారి కరుణాకటాక్షాలు పొందగలరు. మీ విరాళములు బచ్చు పురుషోత్తం సెల్: 9848022520 ,సూర్యాపేట ద్వారా ఫోన్ పే చేయగలరు..

## అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభలను జయప్రదం చేయాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



నవంబర్ 15 నుండి 18వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డిపిలు పునిచ్చారు.శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాకు రైతాంగ పోరాటాల చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్లగొండ ప్రాంతం అత్యంత కీలకమైన పాత్ర పోషించిందని తెలిపారు. రైతాంగ పోరాటాల చరిత్రకు నిలయమైన నల్లగొం డలో అఖిల భారత రైతు సంఘం 36వ మహాసభలు జరగడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుందని ఆయన అన్నారు. గత పోరాటాల స్ఫూర్తితో నేటి రైతాంగ సమస్యలపై మరింత ఐక్యంగా ఉద్యమిం చాల్సిన అవసరంఉందన్నారు.దేశంలో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. .కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణ సౌకర్యం, పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్న, సన్నకారు రైతుల రుణభారాన్ని తగ్గించేందుకు సమగ్ర రుణమాఫీ చేపట్టాలని, వ్యవసాయానికి అవసరమైన సాగునీరు, విద్యుత్, విత్తనాలు, ఎరువులు అందుబా టులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అన్నారు..నల్లగొండ రైతాంగ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశవ్యాప్తంగా రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలను నిర్మించేందుకు 36వ మహాసభలు దోహదపడతాయని మల్లు అన్నారు. మహాసభల విజయవంతానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, గ్రామస్థాయి పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, మహాసభల విజయవంతానికై రైతు కుటుంబాల నుండి విరాళాలను సేకరించాలని కోరారు.రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళా రైతులు, యువత పెద్ద సంఖ్యలో మహాసభల కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఫాగింగ్‌లకు పని చెప్పని సిబ్బంది





-దోమలతో అల్లాడుతున్న పట్టణ ప్రజలు

-ప్రతి వార్డులో ఫాగింగ్ చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి

భానుపురి /సూర్యాపేట:

పట్టణంలోని పలు వార్డుల్లో దోమల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. సాయంత్రం వేళల్లో దోమల సంఖ్య విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు దోమల కారణంగా అవస్థలు పడు తున్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీల్లో మురుగు కాల్వలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థాని కులు చెబుతున్నారు. దోమల నివారణ కు మున్సిపల్ అధికారులు ఫాగింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని వార్డుల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

-వ్యాధుల భయం

దోమల బెడదతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దోమ ల వల్ల వివిధ రకాల వ్యాధులు వ్యాపించే అవ కాశం ఉండటంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, ఉదయం--సాయంత్రం బయటకు వచ్చే వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా ప్రతి వార్డులో పర్యటించి దోమల ఉద్ధృతి ఉన్న ప్రాంతాలను గుర్తిం చాలని, మురుగు కాల్వలు, ఖాళీ స్థలాలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతు న్నారు. అంతేకాకుండా ప్రధాన కాలనీలతో పాటు శివారు ప్రాంతాల్లోనూ ఫాగింగ్ మిషన్లతో క్రమం తప్పకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

-అధికారులు స్పందించాలి

దోమల సమస్యపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ప్రతి వార్డులో ప్రత్యేక ఫాగింగ్ కార్య క్రమాన్ని చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పారిశుధ్య సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేసి మురుగు కాల్వల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిం చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



భానుపురి /కట్టంగూర్,

వృద్ధాప్య దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి శివప్రసాద్ పద్మ దంపతుల సహకారంతో శనివారం గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం పనిచేస్తున్న కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు.కార్యక్రమంలో క్లబ్ అడ్వైజర్ లయన్ రెడ్డిపల్లి సాగర్, సెక్రటరీ లయన్ మంగ దుడ్ల శ్రీనివాస్, కోశాధికారి కల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, బొడ్డుపల్లి వెంకన్న, చిట్టిప్రోలు రామకృష్ణ, సోమేశ్, జిల్లా అశోక్, మన్నెం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దళితులను మోసం చేసిన సంతోష్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

-బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్

భానుపురి /యాదాద్రి భువనగిరి

5 లక్షల రూపాయల అప్పుకు నమ్మించి ఎకరా 20 గుంటలు సేల్‌డీడ్ చేసుకొని 2 లక్షలే ఇచ్చి 3 లక్షలకు బౌన్స్ చెక్కులతో తిప్పలు పెడుతున్న తమకు న్యాయం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు, దళిత సంఘాల నాయకులు శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం టేక్కుల సోమారం గ్రామానికి చెందిన పడమటి సంతోష్ రెడ్డి మార్టిగేజ్ పేరుతో నమ్మించి ఎకరా 20 గుంటల భూమిని సేల్‌డీడ్ చేయించుకుని మోసం చేశారని ఆరోపిస్తూ భువనగిరి మండలం సమాత్‌పల్లి గ్రామానికి చెందిన దళిత మహిళ బిచ్చాల సరిత భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ని ఆశ్రయించారు. కుటుంబ అవసరాల కోసం 5 లక్షలు అప్పుగా అడగగా భూమిని మార్టిగేజ్ పెడితే రుణం ఇస్తామని నమ్మించారని ఆమె ఫిర్యాదులో పేర్కొ న్నారు. 2025 సెప్టెంబర్ 20న తన భర్త గణేష్‌ను భువనగిరి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి, మార్టిగేజ్ పత్రాలంటూ సంతకాలు చేయించారని, అనంతరం సర్వే నంబర్లు 96, 97లోని ఎకరా 20 గుంటల భూమిని సేల్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేయించు కున్నారని ఆరోపించారు. 5 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పి నాలుగు దఫాలుగా కేవలం 2 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.3 లక్షలకు నగదు లేని చెక్కులు ఇచ్చి, ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు తీసుకున్నారని తెలిపారు. అప్పు తిరిగి చెల్లించి భూమిని ఇవ్వాలని కోరినా స్పందించలేదని, భూమిని ఇప్పటికే ఇతరులకు విక్రయించానని బెదిరించినట్లు సరిత ఆరోపించారు. గత ఆగస్టు 19న భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, దీంతో ఎస్పీని ఆశ్రయించినట్లు ఆమె తెలిపారు. భూమిని తిరిగి తమ పేరుపై నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరా రు. దళితులను మోసం చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ డిమాండ్ చేశారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బండారు రవివర్ధన్, దళిత సంఘాల నాయకులు బట్టు రామచంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ మైలారం వెంకటేష్, కర్తల శ్రీనివాస్, ఇటికల



దేవేందర్ మాదిగ, బొల్లెపల్లి అశోక్, కుతాడి సురేష్, ఎండి షఫీక్ అహ్మద్ మాజీ కౌన్సిలర్, అందే సాయి తదితరులు ఉన్నారు.